ఆర్జిత సేవలు, విఐపి దర్శనాల్లో స్వల్ప మార్పులు: టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుమల: వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈనేపథ్యంలో సామాన్యభక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామివారి సేవలు, విఐపి దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్టు టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేయడం జరిగింది. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాది మంది సామాన్య భక్తులకు ఈనిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం అవుతుంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు, వీఐపీలు సహకరించాలని వైవి.సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు.

'ఉపాధి చట్టానికి' మోడీ ప్రమాదం

- అడుగడుగునా నీరుగార్చే కుట్ర
- మోడీ మెడలు వంచైనా పథకాన్ని కాపాడుకుంటాం
- వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కూలీలు, నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశంలోని పేద ప్రజానీకానికి చేతినిండా పనీ, మూడు పూటలా తిండి పెడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. ఉపాధి కూలీలపై ఉన్న సవతి ప్రేమతోనే బడ్జెట్లో భారీగా కోత పెట్టిందంటూ ఉద్ఘాటించారు. మోడీ చెర నుంచి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామంటూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉపాధి కూలీలు నిరసనకు దిగారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దడాల సుబ్బారావు హాజరై ప్రసంగించారు. ఉపాధి హామీపనుల్లో కేవలం వ్యవసాయ కూలీలే కాకుండా చేతివత్తిదారులు, నిరుద్యోగ యువత పాలుపంచుకుంటుందని వివరించారు. అయితే మోడీ ప్రభుత్వం భారీ కోతలు పెడుతోందని వాపోయారు. గత ఉపాధి హామీ సంవత్సరానికి బడ్జెట్లో రూ.90వేల కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్లో కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 20కోట్ల జాబ్ కార్డులు ఉండగా, అవసరమైన బడ్జెట్ 2.5లక్షల కోట్లనీ, మరి మోడీ ప్రభుత్వం కేవలం 60వేల కోట్లతోనే సరిపెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో పనిలేక పస్తులంటున్న ఉపాధి కూలీలకు ఒక్కో కుటుంబానికి రూ.7500లు ఇవ్వమంటే ఇవ్వని మోడీ, కార్పొరేట్లకు మాత్రం రూ.4.5లక్షల కోట్లను రాయితీ కింద మాఫీ చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టం ఓ దండగ అంటోందనీ, వైసీపీ మంత్రులు సైతం అందుకు వంత పాడుతున్నారని వాపోయారు. ఉపాధి పనులు కెళ్లే కూలీలను సోమరిపోతుల్లా వైసీపీ మంత్రులు చిత్రీకరిస్తున్నారనీ, ఆ పథకాన్ని రైతుల చేతుల్లో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారంటూ మండిపడ్డారు. రైతుల చేతుల్లో ఉన్న భూములు పేద కూలీలకిచ్చేస్తే, ఉపాధి కూలీల సౌఖ్యాన్ని రైతులకిచేస్తారంటూ సవాల్ విసిరారు. ఉపాధి పనులు జరిగే చోట కనీస వసతులు కల్పించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నీడ, నీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్న కనీస స్పృహ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక సమ్మర్ అలవెన్సులకు కోత పెట్టగా, తట్టా, బుట్ట, పారా, గడ్డపార కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎగనామం పెట్టిందంటూ ఏద్దేవా చేశారు. మూడు నెలలకోసారి కూడా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదనీ, పని చేసి 15రోజులు దాటితే 0.5 శాతం వడ్డీతో బకాయి చెల్లించాలని చట్టం చెబుతోందన్నారు. మొత్తం మీద మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నీరు గార్చే కుట్ర చేస్తోందనీ, వ్యవసాయ కూలీలు కేంద్రం మెడలు వంచైనా పథకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీవో రామారావుకు వినతిపత్రంఅందజేశారు. జిల్లా కార్యదర్శి తలారి బాలకష్ణ, మురుగేష్, గురవమ్మ, వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య, గంధం మణి, నాగరాజు, వరలక్ష్మి, దినమణి, చెల్లమ్మ, పవిత్ర పాల్గొన్నారు.

ఆర్డీవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జాతరలో జగన్ మంత్రం

ప్రజాశక్తి- తిరుపతి సిటి: పేరుకేమో తాతయ్యగుంట గంగమ్మ జాతర. చేసేదేమో పైకి మాత్రం ఆలయ పాలకమండలి. నిధులేమో దేవదాయశాఖ, తిరుపతి కార్పొరేషన్, తుడా, టిటిడివి. నిర్వాహణ మొత్తం స్థానిక అధికార పార్టీ కీలకనేత కన్నుసన్నల్లోనే. గంగమ్మకు ఆడపడుచు సారె పేరుతో అధికార పార్టీ ప్రచార యాత్రలు చేపట్టింది. ఆలయ ప్రాంగాణంలోనూ, అలంకరణలోనూ అధికారపార్టీ ప్రచారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని తాము అనుకున్నట్లే జరిగేలా వ్యూహం. ముందస్తు ప్రణాళిక ప్రకారమే అన్ని తాము అనుకున్న సమయానికే జరిగేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఆఖరికి గంగమ్మ జాతరలో ఆలయాన్ని వచ్చే భక్తులు కూడా జగన్ మంత్రం జపించేలా చేసి, అమ్మవారి జాతరను వివాదస్పదం చేయడం గమనార్హం.

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర. శతబ్దాలగా నిర్వహిస్తున్న రాయలసీమలోనే అతిపెద్ద తిరునాళ్లు. ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా వారం రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఏడు రోజుల పాటు భక్తులు వివిధ రకాల వేషదారణల్లో ఆలయానికి విచ్చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఈ తిరునాళ్లకు తిరుపతి, చిత్తూరు జిల్లాలోనే కాకుండా రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు పక్కనే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రజలకు సైతం తండోప తండాలుగా విచ్చేసి జాతరల్లో పాల్గొంటారు. పాలకులు ఎవ్వరైనా, ఏ పార్టీ అధికారంలో ఉన్న రాజకీయాలు, ప్రాంతాలు, మతాలకు అతీతంగా ఈ పండగను అందరు ఐక్యంగా జరుపుకోవడం ఆనవాయితీ. కానీ ఈ ఏడాది ఆ ఆనవాయితీకి భిన్నంగా జరిగిందని ప్రజలు బహిరంగంగా గుసగుసలాడుకోవడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన తిరుపతి ఎంఎల్ఏ అన్ని తానే అన్నట్టు జాతరను జరిపించారు. నిర్వాహణ బాధ్యతలు చేపట్టాల్సిన పాలకమండలిని సైతం పక్కన పెట్టారు. ఆలయ పునర్నిర్మాణం, మహాసంప్రోక్షణం, జాతర, సారెలు, పసుపుకుంకుమ, విశ్వరూప దర్శనం అన్నిట్లోనే తాను చెప్పినదే జరిగేలా చేయడంలో విజయం సాధించారు. అన్ని సరే.. గంగమ్మ అమ్మవారికి సైతం రాజకీయ రంగు పులిమి, ఆమెను కూడా వివాదస్పదంలోకి రావడం దారుణం. అమ్మవారి ప్రధాన ఆలయానికి సైతం జగన్ నామస్మరణతో, వైసిపి జెండాలతో పూల అలంకరణ చేసి భక్తులను సైతం విస్తిపోయేలా చేయడం బాధాకరం.

జాతర సందర్భంగా అధికార పార్టీ ఏర్పాట్లలో జె గన్ అలంకరణ (ఫైల్)

ప్రజాదృష్టి

జాతరంతా తన చెప్పుచేతుల్లోనే...

తిరుపతి గంగమ్మ జాతర మొత్తం అధికార పార్టీ శాసన సభ్యుడి చెప్పు చేతుల్లోనే జరిగేలా చేశారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. తిరుపతికి సమీపంలోని అవిలాల నుంచి అమ్మవారికి రాత్రి 9గంటల ప్రాంతంలో పసుపు కుంకాలు (పుట్టింటి సారె) ఇవ్వడం సరా మామూలే. కానీ ఈసారి దానికి భిన్నంగా వ్యవహరించారు. సాయంత్రం 5 గంటలకే తమకు పుట్టింటి సారె ఇవ్వాలని భీష్మించారు. దీంతో అవిలాలలోనే గంగమ్మ పుట్టింటి పెద్దలు విధిలేక 5 గంటలకే సారెను పంపించారు. అక్కడ సైతం అసంతృప్తితో నామమాత్రంగానే జాతర జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలపైన తిరుపతి చాటింపు వేయాల్సి ఉంటే 10గంటల నుంచి చాటింపు వేశారని విమర్శలు వెల్లువెత్తాయి. జాతర జరిగినన్ని రోజులు ఎంఎల్ఏ ఆలయం వద్ద ఉంటూ ప్రతిది తను చెప్పినట్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. అమ్మవారి సారెలు తీసుకొచ్చే యాత్రలను సైతం అధికార పార్టీ ప్రచార యాత్రగా చేశారని గుసగుసలు తప్పలేదు. సారెలు తీసుకొచ్చిన వారంతా అధికారపార్టీకి చెందిన వారే, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులకు తప్ప, ప్రతిపక్షాలకు తావు ఇవ్వలేదు. విఐపి దర్శనాలు లేవంటూనే ఆలయం మొత్తం విఐపిల మయం చేశారు. చివరికి ఆలయ చుట్టుపక్కల మొత్తం వివిఐపిలు, విఐపిల వాహన శ్రేణులతో ట్రాఫిక్ కష్టాలను తెచ్చిపెట్టారు. ముందే ఇరుకైన ప్రాంతం, పైగ వేల సంఖ్యలో భక్తులు, ఇది చాలదన్నట్లు విఐపిలు తాకిడి, వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు, కలిసి పోలీసులకు సైతం తలబొప్పికట్టేలా చేశాయి. చివరికి అమ్మవారి జాతర రోజు అసల కథకు తెరలేపారు. ప్రధాన ఆలయానికి ముందు ప్రదాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పూల అలంకరణ వివాదాలకు తెరలేపింది. సుమారు 4 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవుతో చేసిన పూల అలంకరణలో కుడి, ఎడమ పక్కల అధికార పార్టీకి చెందని వైసిపి జెండాలను, మద్యలో జగన్‌కు సింబల్‌గా జెను, దాని పక్కనే గన్‌ను ఏర్పాటు చేసి జగన్ అనే అర్ధం వచ్చేలా చేశారు. ఇది భక్తులను సైతం విస్మయానికి గురి చేసింది. ఇంత జరిగినా అదేమి తప్పుకాదని, అలంకరణ చేసిన కాంట్రాక్టరు జగన్‌పై అభిమానంతో అలా చేసి ఉంటాడని ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఊదరగొట్టడం అందర్ని అవాక్కు అయ్యేలా చేసింది. ఉదయం 4 నుంచి 7గంటల మధ్య జరిగే అమ్మవారి విశ్వరూప చెంప నరుకుడు కార్యక్రమం చాలా ప్రాధాన్యతో కూడుకున్నది. అమ్మవారి ప్రతిమ మట్టికోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. కానీ దానికి భిన్నంగా అర్ధరాత్రి ఒంటి గంటకే చంపనరుకుడి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఇదేమని అడిగితే... ఫలానా కార్యక్రమం ఫలానా సమయానికే చేయాలనే సిద్దాంతం ఏమైనా ఉందా అనే దోరణిలో భక్తులతో తిరగబడడం గమనార్హం. ఏది ఏమైనా శతబ్దాల చరిత్ర గల గంగజాతరను సైతం అధికార పార్టీ తమ ప్రచారాలకు వినియోగించుకుని, వివాదస్పదం చేయడం పలువుర్ని విస్మయానికి గురి చేసింది. అధికార పార్టీ పెద్దలను ఎదిరించలేక, ప్రజలు సైతం అంతా అమ్మవారే చూసుకుంటారంటూ తిట్టుకుంటారంటు వెళ్లిపోయారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం సరైనది కాదని పలువురు సాహితీవేత్తలు హితవు పలికారు.

ప్రతి గ్రామానికి శ్మశాన స్థలం తప్పనిసరి

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి స్మశానం తప్పనిసరిగా ఉండాల్సిందేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. శనివారం గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురం పంచాయతీలో మాజీ సింగిల్ విండో వైస్‌ఛైర్మన్ నరసింహులు నాయుడు, పాతపాళ్యం పంచాయతీలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్ మొదలి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, నేతలతో కలిసి డిప్యూటీ సీఎం పర్యటించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ స్మశానానికి కావాలని గ్రామస్తులు ఎవరైనా వినతిపత్రాలు అందజేస్తే దానిపై ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్‌కు తాను ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అందుకు జిల్లా కలెక్టర్ సైతం స్పందించి ఏగ్రామానికి స్మశాన స్థలాలు లేనట్లు తెలిస్తే వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సమస్య పరిష్కరిస్తారని కలెక్టర్ వివరించారని చెప్పారు. చంద్రబాబు ఏమో రూ.2వేలరూపాయల నోట్లను అమల్లోకి తెచ్చింది నేనే అంటాడు, మళ్ళీ రద్దు చేయించాలని డిమాండ్ చేసింది నేనే అంటావ్ అబద్ధాలు చెప్పడం నీకు సాటి ఎవరూ లేరన్నారు. కష్ణానది కరకట్టపై ఇల్లు, అమరావతి భూ కుంభకోణం స్కిల్ డెవలప్మెంట్ ఎంతో అవినీతి జరిగిందని సీఐడీ తేల్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాధన్, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి, మాజీ కన్వీనర్ సురేందర్ రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ గుణశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, మండల ఆర్బీకే సంఘం అధ్యక్షులు బలరామిరెడ్డి కేశవులు రెడ్డి, ఏకాంబరం పాల్గొన్నారు.

వారధులై ప్రభుత్వ ఫలాలను ప్రజలకు చేర్చండి

మండల సమావేశంలో మంత్రి ఆర్కే రోజా

ప్రజాశక్తి- నగరి: మండల పరిషత్ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు అందించే వారదులుగా ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ భార్గవి అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. తొలుత ఎంపీపీ మండలంలోని అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివద్ధి పనులను వివరించాలని కోరారు. అధికారులు వివరాలు చెప్పిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ పథకాల ఫలాలు ప్రజలకు అందించే బాధ్యత, ప్రభుత్వం చేస్తున్న మంచిని వారికి వివరించే బాధ్యత ప్రజాప్రతినిధులపైనే ఉందన్నారు. గడపగడపలో మంజూరైన అభివృద్ధి పనులన్నీ కంప్లీట్ చేయమని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు. ఇల్లు కేటాయించిన వారు జున్‌లోగా పూర్తిచేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉందని, గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. వడగాలులు వీస్తునందున అన్ని ప్రభుత్వ హాస్పిటల్లో పరికరాలు, మెడిసిన్స్ అందుబాటులో ఉండాలని ఏమైనా అవసరమైతే చెబితే వాటిని తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తానన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాలని ప్రజాప్రతనిధులు కోరగా ఈ అంశంపై తాను ఇదివరకే అధికారులతో చర్చించడం జరిగిందని మంత్రి సమాధానమిచ్చారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో శేషగిరిరావు, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటలక్ష్మి, కన్నియప్ప పాల్గొన్నారు.

నేతన్నకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం: మంత్రి

నేతన్నకు ప్రస్తుత ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి ఆర్కేరోజా అన్నారు. నేత కార్మికులు అధికంగా నివశించే మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో శనివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ ఛైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, మండల సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ నళిని, మున్సిపల్ కమిసనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞానం వినోదం

జెవివి, గ్రంథాలయ సంస్థ ఉచిత సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులకు విజ్ఞానం వినోదం పంచేందుకు జనవిజ్ఞాన వేదిక, జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్తంగా ఉచిత వేసవి శిక్షణా తరగతులు (సమ్మర్ క్యాంపు) నిర్వహిస్తోంది. చిత్తూరు నగరంతో పాటు పరిసర గ్రామాల్లో పేద, మధ్య తరగతికి చెందిన ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ విద్యార్థుల వేసవి శిక్షణా తరగతులకు అవరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. రోజుకు 60 నుంచి 70మంది విద్యార్థులు సమ్మర్ క్యాంపులో పాల్గొంటారు. ఈనెల 8వ తేదీ నుంచి జిల్లా గ్రంథాయం నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపుకు జనవిజ్ఞాన వేదిక పూర్తి సహకారం అందిచడంతో పాటు జెవివి నాయకత్వం సమ్మర్ క్యాంపులోని విద్యార్థులకు సైన్సుకు సంబంధించిన అంశాలతో పాటు ఆట,పాటలతో విద్యార్థులతో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తున్నారు.

విజ్ఞానం... వినోదం..

వేసవి సెలవులో టీవీలు, సెల్‌ఫోన్స్‌కు పరిమితం కావడం చూస్తున్నామనివేసవి శిక్షణా తరగతుల నిర్వాహకులు జెవివి, జిల్లా గ్రంథాలయ సంస్థ సంయుక్తంగా నిర్వాహకులు అరుణ శివప్రసాద్, సుధాకర్ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుబాల తెలిపారు. ఈత సరదా పేరుతో బావులు, చెరువుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవడం, మండిపోతున్న ఎండల్లో వీధుల్లో తిరిగి ఆరోగ్య సమస్యలు తెచ్చుకోకుండా వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు విజ్ఞాన్ని పెంచుకోవడంతో పాటు పుస్తకాలపై ఆసక్తిని పెంచడంతో పాటు యోగ, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, నాటికలు, ఇంగ్లీష్ గ్రామర్, చెస్, క్యారమ్స్, సంగీతం, డాన్స్ ఇతర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇప్పించి ప్రతివారం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం, విజ్ఞానాన్ని పెంపొందించడం, సజనాత్మకతను పెంచే కషిలో భాగంగా ఉచిత వేసవి శిక్షణా శిబిరం ఉద్యేశమని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం పిల్లలను ఉచిత వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరుతున్నారు. సమ్మర్ క్యాంపులో పాల్గొనుటకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎవరైనా చిత్తూరులో గల మిట్టూరు, బాలాజీ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో ఉన్న కేంద్ర గ్రంథాలయానికి వచ్చి వారి పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఆసక్తిగా పాల్గొంటున్న విద్యార్థులు..

జిల్లా గ్రంథాలయ సంస్థ, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపుకు ఆదరణ పెరుగుతోంది. మొదటి రోజు తక్కువ మందితో ప్రారంభమైనప్పటికీ రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. విద్యార్థులు ఆసక్తిగా సమ్మర్ క్యాంపులో చేరుతున్నారు. బయట నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులు రూ.2 వేల నుంచి 3వేలకు పైగా ఫీజులు రూపంలో వసూలు చేస్తుండటంతో గ్రంథాలయం, జెవివి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్యాంపుకు పేద,మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకుంటున్నారు. వారి ఆసక్తి ఉన్న కళలు, చిత్ర లేఖనం, క్రీడలు, యోగా, సైన్సు ప్రయోగాలు వంటి అంశాలను ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి..
- మధుబాల, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్

గ్రంథాలయ సంస్థ ఇతర సంస్థల సహకారంతో వేసవిలో విద్యార్థుల కోసం ఉచితంగా సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి. వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్నుకు పరిమితం కాకుండా విజ్ఞానం, వినోదం పెంపొందించు కోవడంతో పాటు పుస్తకపఠనం పెరుగుతుంది. సైన్సు ప్రయోగాలతో సృజనాత్మకశక్తి పెరగడంతో పాటు మంచి అలవాట్లు, నడవడిక పెంపొందించుకుంటారు.

విజ్ఞానంతో కూడిన వినోదం...
- సుధాకర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి

వేసవి శిక్షణా శిబిరం గ్రంథాలయం, జేవివి సంయుక్తంగా విద్యార్థులల్లో విజ్ఞానం వినోదం పెంచేలా విద్యార్థులకు సైన్సు అవసరం, సైన్సు ద్వారా కలిగే ప్రయోజనాల తెలియచేస్తూ ప్రయోగాలు చేయడంతో పాటు, సైన్సు జిమిక్కులు వినోదంతో పాటు విజ్ఞానం పెంచుతాయి. ఆలోచనా శక్తిని పెంచుతాయి. చదువుతో పాటు విజ్ఞానం పెంచేలా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నాం. మీ ప్రశ్న - మా సమాధానం, సైన్సు పట్ల ఆసక్తిని పెంచేలా గత పది సంవత్సరాలుగా జేవివి, గ్రంథాలయ సంయుక్తంగా విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తోంది. ఆసక్తిగా విద్యార్థులు పాల్గొంటున్నారు.

500 మొబైల్ ఫోన్లను చాట్‌బాట్‌తో రికవరీ

అతి తక్కువ సమయంలోనే రికవరీ చేశాం : జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కోటి రూపాయల విలువ చేసే 500 సెల్‌ఫోన్లు చాట్‌బాట్ ద్వారా రికవరీ అతి తక్కువ సమయంలోనే రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. సెల్‌ఫోన్ను రికరీపై శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఒక భాదితురాలి ఫిర్యాదు అందిన 4 గంటల లోపు మొబైల్ ఫోన్ రికవరీ చేశామన్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి రికవరి చేయడంతో పాటు జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, బీహార్ వంటి రాష్ట్రాల నుండి మొబైల్‌ఫోన్ల రికవరీ చేసినట్లు తెలిపారు. మారుతున్న జీవనశైలిలో మొబైల్ వినియోగం ఎక్కువై మనలో ఒకటిగా మారిపోయిన మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారి బాధ వర్ణతాతీతం. అటువంటి మొబైల్ ఫోన్‌ను ఎటువంటి కంప్లయింట్ లేకుండా పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఇంట్లో కూర్చొని చిత్తూరు పోలీసు వారి 'చాట్ బాట్' సేవల ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను మరలా పొందవచ్చునని తెలిపారు. శనివారం 500 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు చాట్ బాట్ బందం మొబైల్ ట్రాకింగ్‌పై బాగా పని చేస్తున్నారన్నారు. పోయిన మొబైల్‌ఫోన్లు మన రాష్ట్రం లోనే కాకుండా ఇతర రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్, రాజాస్థాన్, ఢిల్లీ, కేరళ, బీహార్, పంజాబ్, చిత్తూరు జిల్లా సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాల నుంచి మొబైల్ ఫోన్ల రికవరీ చేసి భాదితులకు అందజేసిన పోలీస్ సిబ్బంది పని తీరు హర్షనీయమని తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్న భాదితులు కేవలం చిత్తూరు జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు మరియు జిల్లాల నుండి కూడా ఫిర్యాదు చేస్తున్నారు. వారి ఫోన్‌లను కూడా రికవరీ చేసి అందజేస్తున్నామన్నారు. ఇంకా పెండింగ్ రికవరీలు ఉన్నాయని వాటిని కూడా అతిత్వరలో రికవరీ చేసి భాదితులకు అందచేస్తామని తెలియజేశారు. మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కషి చేస్తామని ఎస్పీ తెలియజేశారు. అతితక్కువ సమయంలో 500 మొబైల్ ఫోన్‌లను రికవరీచేసి బాధితులకు అందజేసేందుకు కషి చేసిన క్రైమ్ సిఐ భాస్కర్, క్రైమ్ ఎస్ఐ ఉమామహేశ్వర రావు, వారి సిబ్బందిని ఎస్పీ సర్టిఫికేట్, కాష్ రివార్డ్‌తో అభినందించారు.

ఐదేళ్లలోపు చిన్నారుల కోసం

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలో సాంబయ్య కండ్రిగ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాలలో పేర్ల నమోదు, లబ్ధి కోసం ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్‌కార్డ్ నమోదు చేయించే కార్యక్రమం ప్రత్యేకంగా చేపడుతున్నట్లు వివరించారు. నగర పాలక పరిధిలో ఇంకా 969 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఐసిడిఎస్, వార్డ్ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి చిన్నారులందరూ ఆధార్ నమోదు చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అంబేద్కర్‌నగర్, కట్టమంచి, టెలిఫోన్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, చామంతిపురం, మంగసముద్రం, మోరిగానిపల్లి, మురకంబట్టు, పీహెచ్ వాడ, సాంబయ్య కండ్రిగ, బాలాజీ నగర్ వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు చేసుకోవడంతో పాటు, పేరు, చిరునామా వంటి మార్పులు సరి చేసుకోవచ్చని చెప్పారు. సాంబయ్య కండ్రిగ వార్డు సచివాలయంలో ఆధార్ కేంద్రంలో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆధార్ నమోదు కోసం వచ్చిన చిన్నారులను కాసేపు సరదాగా ఆడించారు. స్థానిక కార్పొరేటర్ హరిణి రెడ్డి, సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ సర్వీస్ సెంటర్ ప్రారంభించడం ఆనందం

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని దోరణాల చెంగన్న వీధిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సర్వీస్ సెంటర్ నడపడం ఎంతైనా ఆనందించాల్సిన విషయమని పట్టణ సీఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించడానికి శనివారం ముఖ్యఅతిథిగా సీఐ హాజరై ప్రసంగించారు. సర్వీస్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు అవసరమైన అన్ని జీఓల సంపుటాలు ఉన్నాయన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత ఉద్యోగులకు సేవలు చేయాలన్న యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి ఆలోచనలు చాలా మంచిదన్నారు. అన్ని వర్గాల ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యలు నివృత్తి చేసి సేవలు అందించడం జరుగుతుందని నిర్వాహకులు సోమచంద్రారెడ్డి అన్నారు. 1998 డిఎస్సి ఆత్మీయ సమావేశాన్ని ఈ సందర్భంగా నిర్వహించారు. డిఎస్సిలో క్వాలిఫై అయి 24 ఏళ్ల పిమ్మట తమను రాష్ట్ర ప్రభుత్వం ఎంటిఎస్ ఉపాధ్యాయులుగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రోషన్ ఆలీఖాన్ అన్నారు. సుదీర్ఘకాల తమ పోరాటం ఫలించిందన్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ఋణపడి ఉన్నామని, ప్రభుత్వ కొలువులు చివరి వయస్సులో వస్తాయని కలలో కూడా ఊహించలేదని ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఎఆర్ కుమార్, గిరిధర మూర్తి, ఖాన్‌లు అన్నారు. మాజీ కౌన్సిలర్ మూర్తి, పట్టణ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, మదర్ థెరిస్సా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయపాల్ రెడ్డి, ఎంటిఎస్ ఉపాధ్యాయులు లక్ష్మీ, హరి, సూర్యప్రకాష్, శాదాద్, రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం శనివారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో టోటల్ హెల్త్ అరగొండ అపోలో, సమస్త సిబ్బంది హరిత ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం వైద్యులు శిరీష మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకుండా ఉండటం వంటి లక్షణాలున్నవారు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గళ్ల పరీక్ష చేసుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత ఆరు మాసాలు క్రమం తప్పక మందులు వాడాలన్నారు. వీరికి టోటల్ హెల్త్ అరగొండ అపోలో వారు నిత్యసర సరుకులు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో క్షయ పర్యవేక్షకులు శివకుమార్, ప్రకాష్, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మేటి మందలో 104 సేవలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ మేటి మంద గ్రామంలో సోమల ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో 104 సేవలను నిర్వహించారు. గ్రామంలోని పలువురు రోగగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్ ఇతర వ్యాధులకు మందులను మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఎర్రనాగులవారి పల్లి, గంగిరెడ్డి పురం గ్రామాలలో 104 సేవలను ప్రజలకు అందజేశారు. పలువురు బెడ్ రెస్ట్‌లో ఉన్న రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి సలహాలు, సూచనలను అందజేసి మందులు మాత్రలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య సలహాలు అందజేశారు. సిహెచ్ఓ అమర్‌నాథ్, ఎమ్మెల్యే హెచ్‌పి శాంభవి, ఎఎన్ఎం మధనిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేయండి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం నుంచి మొరవ వరకు మూడవరోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా యుగంధర్ పొన్న శనివారం మీడియాతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సమర్థుడు అయితే కార్వేటినగరం నుంచి వెదురుకుప్పం మీదుగా కొత్తపల్లిమిట్ట వరకు రోడ్డు వెడల్పు చెయ్యాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేగా రెండుసార్లు, మంత్రిగా ఒకసారి, ఉప ముఖ్యమంత్రిగా ఒకసారి గెలిచిన నీవు నియోజకవర్గ ప్రజల కోసం రోడ్డును వెడల్పు చేయలేవా? నువ్వే బాధ్యుడవు, నువ్వే ఈ రోడ్డును వెడల్పు చేయాలి. ఎందుకంటే ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యే నువ్వే, తప్పదని అన్నారు. కార్యక్రమంలో వెదురుకుప్ప మండల అధ్యక్షులు పురుషోత్తం, ఉపాధ్యక్షులు సతీష్, ప్రధాన కార్యదర్శి రజని, కార్యదర్శి ముని, పార్టీ సీనియర్ నాయకులు యతీశ్వర్ రెడ్డి, పాలసముద్రం మండల అధ్యక్షులు లతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పెనుమూరు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, చెన్నై శంకర్ నేత్రాలయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పెనుమూరు ముత్యాలమ్మ దేవస్థానం వద్ద శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ మురళీకష్ణ 41 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ త్వరలో వీరికి చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల మూడవ శనివారం పెనుమూరులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, పరిసర మండలాల రోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్ఐవిపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: హెచ్ఐవిపై అప్రమత్తంగా ఉండాలని ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని దళితవాడలో హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసిటిఎస్ కౌన్సిలర్ మాట్లాడుతూ వ్యసనాలు, రక్తమార్పిడి వలన హెచ్ఐవి సోకుతుందని, వ్యాధి సోకితే ప్రమాదమని అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ద్రాక్షాయని, జబీనా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బోయకొండ గంగమ్మ జాతర

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ వజ్రాల పుర బోయకొండ గంగమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ వంశపార ధర్మకర్త రాధమ్మ కృష్ణప్ప తెలిపారు. సోమవారం ఉదయం గణపతి పూజ, కలశపూజ జరుగుతుందని, మంగళవారం ఉదయం అంబల్లు పొంగళ్ళు నిర్వచించి బుధవారం బొమ్మాయిపల్లి తిమోజిపల్లి బంగారుపాళ్యం తగ్గువారి పల్లి పంచాయతీలలో జలప్రవేశం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమల్ల సుబ్బారాయుడు శనివారం డిమాండ్ చేశారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని వర్కర్స్ సమస్యలపైన నగరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏఐటీయూసీ పట్టణ నాయకులు వేలన్, భాష మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి నాయకులు రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సదుంలో వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుం గ్రామంనందు నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన సముదాయ ప్రాంగణంలో ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిచే నియోజకవర్గంలోని పలువురు వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారం అందజేయడం జరుగుతుందని సదుం జడ్పిటిసి సోమశేఖరరెడ్డి తెలిపారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 1,444 మంది వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్రా, సేవా రత్న కేటగిరీల కింద ఎంపిక కాబడిన వాలంటీర్లకు నగదు పురస్కారం ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. సోమల, సదుం, చౌడేపల్లి, పుంగనూరు, పులిచెర్ల, రొంపిచర్ల మండలాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ మల్లప్ప కోరారు. కాగా శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లను మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, చౌడేపల్లి రూరల్ సీఐ మధుసూదన్ రెడ్డి, మంత్రి పిఎ తుకారాం, ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుంగనూరు: ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు శనివారం పుంగనూరులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, రామచంద్ర యాదవ్ యువసేన టీం సభ్యులు సంయుక్తంగా జన్మదినం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం వెయ్యి మందికి అన్నదానం చేసి, ప్రజలకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘ సభ్యులు మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో ప్రముఖ వ్యాపారవేత్త బి.రామచంద్ర యాదవ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ప్రజలు, రైతు సమస్యలపై చేస్తున్న పోరాటాలకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. జన్మదిన సందర్భంగా ఆర్సీవై టీం సభ్యులు పట్టణంలో అనేక ప్రాంతాల్లో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జయకుమార్, గురు వేమారెడ్డి, చెన్న కేశవ, హరి, పవన్, రెడ్డి, రామచంద్ర యాదవ్ యువసేన టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-నగరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరి పురపాలక సంఘం సంతమైదానంలో 'మేరా లైఫ్-మేరా స్వచ్ఛ నగర్ 'ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన ఏర్పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జూన్ 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇళ్లలో నిరూపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్ళు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర వస్తువులను ఈ సెంటర్‌కు అందిస్తే, వారు వాటి అవసరం ఉన్న ఇతరులకు వాటిని అందజేస్తారన్నారు. ఈ సెంటర్‌కు నిరూపయోగంగా ఉన్న వస్తువులు ఇవ్వదలచిన వారు తమ ప్రాంతంలోని శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీకి సమాచారం అందించాలన్నారు. వారు మీ వద్ద వస్తువులను సేకరించి ఆర్ఆర్ఆర్ సెంటర్‌కి తరలిస్తారన్నారు. మనం వినియోగించని వస్తువులను ఇతరులు ఉపయోగించుకోవడానికి అందించి, సహాయపడే అవకాశం కల్పిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సేవలకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ప్రజాశక్తి-పులిచెర్ల: సీఎం సహాయ నిధి పేదలకు వరమని జడ్పిటిసి సభ్యులు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి, మంత్రి పీఏ ముని తుకారం తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కులు రూ.6.40 లక్షలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సభ్యులు, ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలంలోని బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి మంజూరైందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం సహాయ నిధి నగదును ప్రభుత్వం త్వరితగతిన మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం మండలంలోని లబ్ధిదారులైన రాజేశ్వర్ నాయుడు రూ.లక్ష, హసీమ్ సాహెబ్ రూ.26 వేలు, ఖాదర్ వల్లీ రూ.20 వేలు, మహిత రూ. 34 వేలు, చంద్రకళ రూ.3 లక్షలు, కుమారి రూ.40 వేలు, హేమకుమార్ అచ్చారి రూ.1.20 లక్షలను పంపిణీ చేశారు. నాయకులు నాధమునిరెడ్డి, పోకల చంద్ర, దామోదర్, పోకల గంగయ్య, శ్రీనివాసులు, నరసింహులు, ప్రభాకర్, మునిరత్నం, చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో వసతి గృహాలకు మహర్దశ

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ప్రభుత్వ వసతి గృహాలకు నాడు-నేడు పనులతో మహర్దశ రానుందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల సమీకృత వసతి గృహాన్ని, ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడిఓ మోహనమురళీ, ఏఎస్ఏ ఏఈ నాగభూషణంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో నాడు-నేడు పథకంతో వసతి గృహాల రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గుర్తు చేశారు. ఈ క్రమంలో భాగంగా సమీకృత వసతి గహంలో మైనర్ రిపేర్ల కింద ట్యాప్లు, కిటకీలకు, గేట్లకు మెస్లు ఏర్పాటు, వసతిగహం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, అదే విధంగా చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి నుంచి వసతి గహం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎస్సీ బాలికల వసతి గహాన్ని సందర్శించి వార్డెన్ బాబును సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గహానికి చెందిన స్లాబ్ పెచ్చులూడి పోయిందని, నీటి సమస్య ఉందని, స్నానపు గదుల తలుపులు మర్మత్తుకు గురైనట్లు వార్డెన్ చెప్పడంతో నాడు-నేడు పనులతో పాఠశాలలు ప్రారంభించే లోపే వసతి గహాల్లో మౌళిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. వారి వెంట మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ గిరి, సమీకత వసతిగహం వార్డెన్ హేమలత ఉన్నారు.

డిప్యూటీ సీఎం చొరవతో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-పెనుమూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె నారాయణస్వామి చొరవతో మండలంలోని ఉగ్రానపల్లెలో రూ.3 లక్షలతో నూతన సిమెంట్ రోడ్డును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ ఐరాల మురళి కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి సిమెంటు రోడ్డు కావాలని గ్రామస్తులు డిప్యూటీ సీఎంను కోరారు. దీంతో ఆయన నూతనంగా సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు డిప్యూటీ సీఎంకు, సర్పంచ్‌కు కతజ్ఞతలు తెలిపారు.

కూలీలుగా మారిన మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌కు లారీలో వచ్చిన షూలు, సాక్సుల మూటెలు మోసేందుకు ఎంఆర్‌సి సిబ్బంది కూలీలుగా మారారు. వివరాల్లోకెళితే.. జడ్పి ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను స్టాక్ పాయింట్ కింద ఏర్పాటు చేసి వాటిని ఆయా పాఠశాలలకు అందజేసే విధంగా మండల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 60 మూటెల షూలు, 24 సాక్సుల మూటెలను స్టాక్ పాయింట్‌కు చేర్చేందుకు వీలు లేకపోవడంతో కంటైనర్ పెద్దదిగా ఉండటంతో పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద దించారు. దీంతో చేసేదేమీ లేక సిఆర్పిలు, ఐఆర్టి సిబ్బంది మూటెలను మోసి స్టాక్ పాయింట్ కు చేర్చారు.

న్యాయం చేయాలని నిరాహార దీక్ష

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని బండవాండ్ల గ్రామానికి చెందిన ద్వారకానాద నాయుడు పది సంవత్సరాల క్రితం ఇందుమతిని వివాహం చేసుకున్నాడు. పెళ్లి సమయంలో రూ.10 లక్షల నగదు కట్నంగా ఇచ్చి హిందూ సాంప్రదాయ ప్రకారం వివాహం చేశారు. బండి వాండ్ల ఊరి సమీపంలో నేషనల్ హైవే కోసం భూమిని అధికారులు తీసుకొని రూ.50 లక్షల నష్ట పరిహారం భర్తకు వచ్చినట్లు బాధితురాలు తెలిపింది. తన ఆడపడుచు హేమలత, భర్త దేవరాజు నాయుడులు డబ్బుల కోసం తన తమ్ముడైన ద్వారకానాథ్ నాయుడుకి తనపై నిందలు వేసి భార్యాభర్తల మధ్య గొడవలు సష్టించారని తెలిపారు. అంతేకాక తన పేరున ఉన్న ఇంటి స్థలాన్ని విక్రయించి డబ్బులు ఇవ్వాలని, భర్త తనను వేధించేవాడని తెలిపింది. లేకపోతే నిన్ను నీ బిడ్డను చంపుతానని బెదిరించి తన బిడ్డను తన వెంట తీసుకువెళ్లారని కన్నీరు మున్నీరయింది. ఎంత వెతికినా బిడ్డ ఆచూకీ తెలియకపోవడంతో ఇందుమతి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి 4 నెలలైనా తనకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. దీంతో శనివారం భర్త ఇంటిముందు నిరాహార దీక్షకు దిగడంతో ఇది తెలిసిన మహిళా సంఘాలు ఇందుమతికి మద్దతు తెలిపాయి. తన బిడ్డను అప్పగించేంత వరకు తను విరమింపజేయని మీడియాకు తెలిపింది.

నేత్రపర్వంగా రథోత్సవం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానికంగా వెలిసిన శ్రీవేణు గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు శనివారం రథోత్సవం కనుల పండువగా సాగింది. స్వామివారు రక్మిణీ, సత్యభామ సమేతుడై దివ్య రథంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన, శాత్తుమొర చేపట్టారు. ఆశేష భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య స్వామి, అమ్మవార్లు రథంపై నగరవీధుల్లో విహరించారు. రథంపై విహరించే మాధవుడిని దర్శిస్తే పునర్జన్మ ఉండదని పురాణాలు చెబుతు న్నాయి. దీంతో భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి రథంపై మిరియాలతో కూడిన ఉప్పును చల్లుతూ స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. భజన బందాలు, కోలాట ప్రదర్శనలు, చెక్కభజనలు. మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయాధికారి సురేష్ కుమార్, కంకణబట్టు, అర్చకులు దశరథి, కిరణ్ భట్టాచార్యులు, సుందరవరదాచార్యులు, టిటిడి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందులు పిచికారి చేయాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంటలకు డ్రోన్‌తో మందులను పిచికారి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని చికూరు పల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి పద్మజా ఆధ్వర్యంలో డ్రోన్‌తో మందులు పిచికారి చేసే విధానంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజన్లో మందులను డ్రోన్‌తో పిచికారి చేయాలని పంటలకు పైనుంచి పిచికారి చేయడం వలన తెగులుబారి నుంచి కాపాడవచ్చని అన్నారు. అదేవిధంగా పంటను సాగు చేసేటప్పుడు విత్తన శుద్ధి యాజమాన్య పద్ధతిలో సాగు చేయాలని అందువల్ల అధిక దిగుబడి సాధించవచ్చు అన్నారు. కార్యక్రమంలో డిఆర్సి సిబ్బంది గోపాల్, మధుసూదన్ రెడ్డి, మండల విస్తరణ అధికారి సాదరయ్య, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండలంలోని సాతంభాకంలో డ్రోన్‌తో పంటలకు మందుల పిచికారి కార్యక్రమం శనివారం ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఐదు మంది గ్రూపుగా ఏర్పడి రూ. 10 లక్షల విలువైన డ్రోన్‌ను 50% రాయితీతో కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ డ్రోన్‌తో ఒక ఎకరా విస్తీర్ణాన్ని ఎనిమిది నిమిషాలలో పిచికారి చేయడం ప్రయోగత్మకంగా చేపట్టారు. వ్యవసాయ అధికారి కళ్యాణ్‌బాబు, రైతు భరోసా కేంద్ర గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో గాలి, వాన బీభత్సంతో తీర్థం, దేవదొడ్డి, కైగల్. గ్రామాల్లోని రైతుల మామిడి చెట్లు నేలమట్ట మైనట్లు, టమాటా, కోసపువ్వు పంటల్లో అధి క సంఖ్యలో నష్టం జరిగిందని శనివారం రై తులు ఆందోళన వాపోయారు. ఉన్నతాధికా రులు వెంటనే స్పందించి పంటలను పరిశీ లించి నష్ట పరిహారం అందేలా చూడాలని రైతన్నలు కోరుతున్నారు.

నేరాలు-ఘోరాలు

నవనీతమ్మకు నాయకుల నివాళులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని సిడి కండిగా గ్రామంలోని ఆకుల నవనీతమ్మ (102) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జిడి నెల్లూరు టీడీపీ కో ఆర్డినేటర్ బీమినేని చిట్టిబాబు నాయుడు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు శ్రీధర్ యాదవ్, గుండయ్య, బీగాల రమేష్, దాసరి గణేష్, చంద్రయ్య తదితరులు నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వై.క్రిష్ణమనాయుడు మృతికి గాలి భాను సంతాపం

ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీ పరిధిలోని అనంతప్పనాయుడు కండ్రిగకు చెందిన వై.క్రిష్ణమనాయుడు శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ మృతుని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

గుర్తుతెలియని శవం లభ్యం

ప్రజాశక్తి-విజయపురం: స్థానిక మండలంలోని జగన్నాధపురం పంచాయతీ పరిధిలోని అడవికి పోయే దారిలో శనివారం ఒక గుర్తు తెలియని శవం కనబడిన ఘటన చోటుచేసుకుంది. ఉపాధి హామీ కూలీలు పనులు చేసుకొని వస్తుండగా ఈ శవాన్ని చూసి గ్రామస్తులు వెంటనే విజయపురం ఎస్ఐ నరేష్ కి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసు బందం చేరుకొని గ్రామస్తులను విచారించగా రెండు రోజుల క్రితం కష్ణ సముద్రం గ్రామాల్లో తిరుగుతూ ఉన్నాడు, అతని ఊరు తిరుత్తని అని చెప్పానన్నాడు. అతనికి 23 వయసు ఉంటుందని, జీన్స్ ప్యాంట్ ధరించి ఉంటాడు. బ్లూ కలర్ షర్టు కాకపోతే వేసుకోలేదు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ శిరీష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి మంగళ, గురువారాల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తారని, బుధ, శుక్రవారాల్లో గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం ఏర్పాటు చేయబడిందన్నారు. గురు, శుక్రవారాల్లో ప్రత్యేక చిన్న పిల్లల వైద్యులచే వైద్య పరీక్షలు చేయబడుతుందని, ఆసుపత్రిలో ప్రతి ఒక్కరిరీ నాణ్యమైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడమైందని తెలిపారు. గ్రామీణ ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాన ఆరోగ్య కార్యకర్త మునీరా భాను, సిబ్బంది నిజాముద్దీన్, కష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సల్లాపురమ్మ గేరిగే మెరివిని సంబరాలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ఆనవాయితీగా వస్తున్న సల్లాపురమ్మ జాతర ఈనెల 16వ తేదీ నుంచి జరిగిన సల్లాపురమ్మ గంగ జాతర అతి వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 19వ తేదీ రాత్రి పుష్పపల్లకి, పూల గేరిగే మధ్య అతి వైభవంగా భాన వేడుకలతో పిల్లనగ్రోలు కోలాటములు విద్యుత్ దీప అలంకరణలో అంగరంగ వైభవంగా సల్లాపురమ్మ జరిగే తలపై ఉంచి చేతితో పట్టుకోకుండా పురవీధులలో దర్శనమిచ్చింది. అనంతరం గుడి వద్దకు చేరుకొని అతి వైభవంగా డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎం మునివీరయ్య, ఎం వీరభద్రయ్య, ఎం నాగేంద్రప్రసాద్, బైరెడ్డిపల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారి కపకు పాత్రులయ్యారు.

బ్యాంక్ మేనేజర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ పి.శివరామిరెడ్డి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయన సేవలు మరువలేనివని మాజీ వాటర్ షెడ్ ఛైర్మన్ గుణశేఖర్ నాయుడు తెలిపారు. శనివారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివరామిరెడ్డిని ఆయన శాలువాతో సన్మానించారు. ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ దగ్గర ఉన్న బాలుర పాఠశాల ఆవర ణంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యా హ్నం ఒక గంట వరకు బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పిఇఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికి త్సలు నిర్వహించబడునని శనివారం నాగ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్ర ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.